రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





హెచ్ఐవీపై నగరంలో అవగాహన ర్యాలీ

2లో

# పేదల భూమిలో మట్టి మాఫియా



బండపల్లిలో మట్టిని లోడు చేస్తున్న దృశ్యం

**▸బండపల్లిలో జెసిబిలతో మట్టి తరలింపు ▸రూపురేఖలు కోల్పోతున్న సర్వే నంబర్ 471 ▸అధికారుల మౌనంపై స్థానికుల ఆగ్రహం ▸వాహనాలు సీజ్ చేయాలని ఆదేశించాం : తహసీల్దార్**

**పెద్దేముల్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** పేద రైతులకు జీవనాధారంగా ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు అక్రమ మట్టి తరలింపుకు కేంద్రాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే కొన్ని ప్రాంతాల్లో భూముల నుంచి మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పెద్దేముల్ మండలం బండపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 471 అసైన్డ్ భూముల్లో నుంచి ఇటాచీ ద్వారా మట్టిని తవ్వి టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నా, సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గృహ అవసరాల నిమిత్తం నిరుపేదలు ఎప్పుడైనా ఒక ట్రాక్టర్ మట్టిని తరలిస్తే వారిపై అధికారులు చూపే ప్రతాపం అంతా ఇంతా కాదు, అదే బడాబాబులు యంత్రాలు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుంటే అధికారులు ఎందుకింత మోనంగా ఉన్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిరుపేద రైతులకు కేటాయించిన అసైన్డ్ భూములను రక్షి ంచాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంటుంది. అలాంటి భూముల నుంచి మట్టిని తవ్వి తరలిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భూమి నుంచి మట్టిని తవ్వేందుకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా, ఉంటే ఎవరికి ఎంత పరిమాణంలో ఏ ప్రయోజనం కోసం అనుమతి ఇచ్చారు, ఇవ్వకుంటే మట్టిని తరలిస్తుంటే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యంత్రాల ద్వారా మట్టిని తవ్వి వాహనాల్లో తరలిస్తుండటంతో అసైన్డ్ భూముల స్వరూపం మారడంతోపాటు భవిష్యత్తులో ఆ భూములను సాగు చేసుకునే రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**తహసీల్దార్ వివరణ:** అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే విషయంపై తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్‌ను వివరణ కోరగా, అక్కడ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అక్ర మంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలని పోలీసులకు చెప్పామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

# పదేళ్ల నిరీక్షణకు తెర



**★ఆర్‌టిసి యూనియన్ల పునరుద్ధరణకు గ్రీన్‌సిగ్నల్! ★కార్మిక సంఘాల్లో నూతనోత్సాహం ★పదేళ్లుగా యాజమాన్యానిదే పైచేయి ★హక్కులు కోల్పోయి నిర్వీర్యమైన కార్మికులు ★సెప్టెంబరులో ఎన్నికలు? ★2016 తర్వాత మళ్లీ ప్రత్యక్ష ఎన్నికలకు మార్గం సుగమం ★గెలిచిన యూనియన్‌కే విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం ★సంస్థ బలోపేతానికి నామినేటెడ్ జోనల్ ఛైర్మన్లను నియమించే యోచనలో సర్కార్**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకిది నిజంగా శుభవార్తే!. పదేళ్లుగా యూనియన్ ఎన్నికలు లేక హక్కులు కోల్పోయిన డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లకు మంచి రోజులు రానున్నాయి. సెప్టెంబరులో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఎన్నికల నిర్వహణకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. గుర్తింపు పొందిన యూనియన్ల సూచన మేరకు ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు వీలవుతుంది.

తెలంగాణ సాధనలో కీలకమైన ఆర్టీసీ కార్మికులకు 2019లో యూనియన్లను రద్దు చేస్తున్నట్లు సర్కార్ చేసిన ప్రకటన పిడుగులా మారింది. 2016లో చివరిసారిగా యూనియన్ ఎన్నికలు జరిగాయి. అప్పటి ఎన్నికల్లో అత్యధిక డిపోలలో జయకేతనం ఎగురవేసిన ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు వచ్చింది. 2019లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం 53 రోజుల పాటు సుదీర్ఘ సమ్మె చేపట్టారు.

కార్మిక సంఘాలు మూకుమ్మడిగా ఏకతాటిపై పోరాటాలు



చేశాయి. అప్పటి ప్రభుత్వం కార్మికులపై కన్నెర్రజేసింది. సంస్థలో యూనియన్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి యూనియన్ లేక కార్మికుల గొంతు మూగవోయింది. యాజమాన్యం అనుసరించిన విధానాలను ధిక్కరించలేక డ్యూటీలు చేశామని అనేక సందర్భాలలో కార్మికులు వాపోయారు.

ప్రస్తుత ప్రభుత్వం యూనియన్ ఎన్నికలను పునరుద్ధరించే దిశగా అడుగులు వేసింది. కార్మికశాఖ ఉన్నతాధికారులతో పలుమార్లు భేటీ జరిగింది. ఎన్నికలను నిర్వహణకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరు మాసంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. గెలుపొందిన యూనియన్‌ను ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన విధి విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదారు యూనియన్లు ఉండగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), ఎంప్లాయిస్ యూనియన్ పటిష్టమంతంగా ఉన్నాయి. ఈ రెండు యూనియన్ల మధ్యనే హోరాహోరీగా పోటీ జరుగుతుంది.

రంగారెడ్డి రీజియన్‌లో మొన్నటి వరు ఆరు డిపోలు ఉన్నాయి. వాటిలో వికారాబాద్, తాండూరు, పరిగి, పికెట్, హైదరాబాద్1, హైదరాబాద్2 డిపోలు ఉండగా ఇటీవల మియాపూర్, బీహెచ్ఈఎల్ డిపోలు కూడా రీజియన్ పరిధిలోకి వచ్చాయి. రానున్న ఎన్నికలకు కార్మికశాఖ అధికారిని నోడల్ అధికారిగా నియమించి ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. కార్మిక సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనియన్ల తుది జాబితా విడుదల చేయనున్నారు. మరోవైపు కార్మికుల్లో పలు ప్రధానమైన డిమాండ్లు అపరిశ్కృతంగా ఉన్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ అమలు తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. రంగారెడ్డి రీజియన్‌లో సుమారు 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిసింది. సెప్టెంబరులో ఎన్నికల జరిగితే డిపో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కార్మికులకు అండగా నిలబడనున్నారు. ఇలా ఉండగా ఆర్టీసీలో గతంలో ఉన్న జోనల్ విధానం మళ్లీ అమలులోకి రానున్నట్లు అధికారవర్గాల సమాచారం. రెండు, మూడు ఉమ్మడి జిల్లాలు కలిపి జోన్‌గా మార్చనున్నారు. నామినేటెడ్ కింద ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు నియమించి సంస్థను పటిష్టమంతం చేసే దిశగా సర్కార్ యోచిస్తోంది.



వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ జిల్లా ఎస్‌పి

# రూ. 10 వేల కూలీ ఆశ చూపి..

**◆52.8 కిలోల గంజాయి రవాణా! ◆రైల్వే స్టేషన్ వద్ద ఎక్సైజ్ దాడులు ◆ఒడిశాకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్..**

**తాండూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయిని పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని 52.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందకు సంబందించి బుధవారం ఎక్సైజ్ జిల్లా సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు.
తాండూరు మీదుగా అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ హైదరాబాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి, డిటిఎఫ్ వికారాబాద్, స్థానిక ఎక్సైజ్ అధికారుల సమన్వయంతో మంగళవారం రాత్రి తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలోని ద్విచక్ర వాహనాల పార్కింగ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు నాలుగు ట్రాలీ బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద తనిఖీ చేయగా పెద్ద ఎత్తున గంజాయి బయటపడింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిశా రాష్ట్రనికి చెందిన మధు ప్రధాన్, శివా నాయక్, నీలు మండల్‌గా గుర్తించారు. ట్రాలీ బ్యాగుల్లో 52.8 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 13లక్షల వరకు ఉంటుందని అన్నారు. అయితే, ఆ ముగ్గురు గంజాయి రవాణా చేసేందకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున కూలీ తీసు కున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, గంజాయి ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు.. ఎవరికి రవాణా చేస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి గంజాయి స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

# కేవలం పాఠాలే కాదు...

**నైతిక విలువలు పెంపొందించాలి- అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు12, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులదే అత్యంత కీలకమైన పాత్ర అని, కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా వారిలో క్రమ శిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందిం చాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిం చిన విద్యాశాఖ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారి స్థాయికి తగ్గట్టుగా బోధనా పద్ధతులను అవలంబించాలని స్పష్టం చేశారు.

**పాఠశాలల్లో ప్రత్యక్ష తనిఖీలు చేయండి**

పాఠశాలల స్థితిగతులను అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పరిశీలించాలని, సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపేలా పనిచేయాలని ఆదేశించారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో మాట్లాడి అవసరమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు.

**సర్కారు బడుల్లో ప్రవేశాల పెంపే లక్ష్యం**

విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత వసతులతోపాటు ఇతర పథకాలపై గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో తల్లిదండ్రులకు విస్తృతంగా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి

అవగాహన కల్పించాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు నిరంతర క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు నైతిక విలువలు, బాధ్యతగల పౌరసత్వాన్ని నేర్పించాలని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షి ంచిన అంశాలు, శాఖాపరంగా చేపడుతున్న కార్య క్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరిం చారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



# కాలం చెల్లిన ఫుడ్‌కలర్స్‌తో మిక్చర్ తయారీ!

**♦చౌదరిగూడలో పోలీసుల సోదాలు ♦ముడి పదార్థాలు స్వాధీనం ♦ నిందితుడు అరెస్ట్**

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాత వార్త:** గడువు ముగిసిన ముడి పదార్థాలతో చౌదరిగూడలో మిక్సర్ తయారు చేస్తున్న ఇంటిపై ఉప్పల్ ఎస్‌వోటీ పోలీసులు దాడి జరిపి ఒకరిని అరెస్టు చేసి, ముడి పదార్థాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌదరిగూడలో మిక్చర్ తయారీదారుల ఇంటిపై ఉప్పల్ ఎస్‌వోటీ పోలీసులు దాడి చేయగా కాలం చెల్లిన ముడి పదార్థాలను ఉపయోగించి మిక్సర్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తయారీ యూనిట్ అపరిశుభ్రమైన పరిస్థితుల మధ్యే మిక్చర్ తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాలం చెల్లిన సింథటిక్ ఫుడ్‌కలర్స్‌ను ఉపయోగించి అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఎలాంటి అనుమతి లేకుండానే ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
నిందితుడు కొర్రెముల పరిధిలోని ప్రత్యూషకాలనీకి చెందిన కాలా జోసెఫ్ (50)ను అరెస్టుచేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి సింథటిక్ ఫుడ్ కలర్ బ్లూ స్టార్ గ్రీన్ ఒక సీసా, సింథటిక్ ఫుడ్ కలర్ లెమన్ ఎల్లో 100 గ్రాములు, సింథటిక్ ఫుడ్ కలర్ బ్లూ స్టార్ 50 గ్రాములు, 999 సింథటిక్ ఫుడ్ కలర్ ఎరుపు పసుపు 25 సీసాలు, తయారీ మిశ్రమం 1 కేజీ 6 ప్యాకెట్లు, ఆకుపచ్చ రంగు బటానీ 1 కేజీ పది ప్యాకెట్లు, కాలం చెల్లిన స్టార్ జైన్ డ్రై మసాలా ఆరు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. నిందితుడితో పాటు కాలం చెల్లిన ముడిసరుకును పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

# కబ్జా కోరల్లో ఫిరంగి నాలా

**నిజాం నాటి సాగునీటి కాలువపై రియల్ ఎస్టేట్ మాఫియా పంజా..**

**ఒక్క వర్షానికే మునుగుతున్న బస్తీలు..**

**70 ఆక్రమణలతో హైదరాబాద్‌కు పెరిగిన వరద ముప్పు..**

**అక్రమాలను తొలగించాలని హైడ్రాకు వినతి**



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

2లో **హైడ్రా రాష్ట్ర వ్యాప్తం కావాలి**

**చేవెళ్ల డాబా ఘటనపై**

# సిపి తరుణ్ జోషి సీరియస్

**హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి సస్పెన్షన్‌కు ఆదేశం**

**చేవెళ్ల, ఆగస్టు 12 ప్రభాతవార్త:** చేవెళ్లలోని ఒక డాబాలో వీరంగం సృష్టించిన హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డితో పాటు అతని అనుచరులపై పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. సైబరాబాద్/ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో చేవెళ్ల సీఐ నరేం దర్ రెడ్డి నిందితులను బుధవారం డీసీపీ ముందు హాజరు పరిచి బైండోవర్ చేశారు. మంగళవారం బాధితులు, రజక సంఘం, ప్రజా సంఘాల నాయకులు కలిసి ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషిని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. స్పందించిన కమిషనర్ వెంటనే విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల డీసీపీని ఆదేశించారు. బాధితురాలు ప్రీతి ఇచ్చిన వివరాలను పరిగణనలోకి తీసుకుని నిందితులపై కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డిపై శాఖాపరమైన చర్యల నిమిత్తం సస్పెన్షన్ నివేదికను కమిషనర్‌కు పంపినట్లు వెల్లడించారు. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమేనని.. తప్పు చేసిన వారు పోలీసులైనా లేదా మరెవరైనా ఉపేక్షించేది లేదని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోలీసులు అండగా ఉంటారని డీసీపీ స్పష్టం చేశారు.

# దొడ్డిదారిన ఔట్‌సోర్సింగ్ పోస్టులు భర్తీ?

**• కాసులు ఇచ్చిన వారికే ప్రాధాన్యం • అర్హుల సరిఫికెట్లు బుట్టదాఖలు చేశారు • విద్యాశాఖ అధికారులపై డిఈవోకు బాధితుల ఫిర్యాదు**

**వికారాబాద్, ప్రభాతవార్త :** విద్యాశాఖలో చేపట్టనున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం పలువురు నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారుల చేతులు తడవకపోవడంతో వారికి సంబంధించిన ధృవపత్రాలను బుట్టదాఖలు చేస్తున్నారు. చేతులు తడిపిన వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తున్నారని బాధిత అభ్యర్థి డీఈఓకు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా మంజూరైన ప్రీ ప్రైమరీ తరగతులకు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు దరఖాస్తులను అర్హులైన అభ్యర్థుల నుంచి స్వీకరించారు. ఇందులో భాగంగా మోమిన్‌పేట్ మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన కావలి మాదవి ప్రీ ప్రైమరీ ఔట్‌సోర్సింగ్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకుంది. ఆమె విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించారు. ఎంపిక ప్రక్రియలో తనకంటే తక్కువ మార్కులు సాధించిన మరో అభ్యర్థికి పోస్టు కేటాయించడంతో మాదవి అవాక్కయ్యారు. ఈ విషయమై డీఈఓ కార్యాలయానికి చేరుకుని తాను సమర్పించిన దరఖాస్తు ప్రతులను పరిశీలించగా, అందులో కొన్ని అర్హత ధ్రువపత్రాలు ఫైల్‌లో కనిపించలేదు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ కార్యాలయం అధికారులను నిలదీసి, తన దరఖాస్తును మరోసారి పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. తాను సమర్పించిన ధ్రువపత్రాలు ఫైల్‌లో లేకపోవడం, అనంతరం పరిశీలనలో అవే పత్రాలు లభించడం పలు అనుమానాలకు తావిస్తోందని మాధవి



వివరాలు మీడియాకు తెలుపుతున్న బాధితురాలు మాధవి

తెలిపారు. ఈ విషయమై అభ్యర్థి మాధవి డీఈఓకు ఫిర్యాదు చేసింది. ప్రీ ప్రైమరీ నియామక ప్రక్రియకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని, అర్హులైన అభ్యర్థులకే నిబంధనల ప్రకారం పోస్టులు కేటాయిస్తామని డీఈఓ అబ్దుల్ ఘని వివరణ ఇచ్చారు.

# కబ్జా కోరల్లో ఫిరంగి నాలా

## సంరక్షించాలని హైడ్రా కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్యే వినతి

**షాద్‌నగర్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** ఆనాటి నిజాం పాలకులు చెరువులు, కాలువలు, నాలాలను తవ్వించారు. అందులో భాగంగానే నిర్మించిన ఫిరంగి నాలా సుమారు 90 కిలోమీటర్ల మేర నాలుగు దిక్కులా ఉన్న చెరువులను కలుపుతూ, రంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు జీవనాధారంగా నిలిచింది. జిల్లాలో ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా ఆనాడు రైతులకు ఈ నాలా వరంలా ఉపయోగపడిందని మేధావులు, పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అయితే, నేడు ఈ ఫిరంగి నాలా పూర్తిగా ధ్వంసమై, తీవ్ర కబ్జాలకు గురైంది. దీంతో ఇప్పుడు హైడ్రా ఈ నాలాపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నాలా సక్రమంగా ఉన్న సమయంలో ఎంత భారీ వర్షాలు వచ్చినా ఇండ్లలోకి నీరు చేరేది కాదు. కానీ ఇప్పుడు చిన్న వర్షం పడితే చాలు రోడ్లన్నీ జలమయమై, ఇండ్లలోకి నీరు చేరుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహ మార్గాలను నిర్మాణాలతో పూర్తిగా మూసివేయడమే నగరానికి ఈ నీటి ముప్పుగా మారింది. ఫిరంగి నాలా దాదాపు 70 శాతం కబ్జాకు గురైనట్లు సమాచారం. చెరువుల పక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ నిర్మాణాలు చేపట్టి, బఫర్ జోన్, ఎఫ్.ఎ.ఎల్ పరిధులను మట్టితో పూడ్చేయడంతోనే ఈ విపత్తులు సంభవిస్తున్నాయి. హిమాయత్



సాగర్ నుంచి మొదలుపెడితే ఎర్రకుంట, పహాడీషరీఫ్, కొత్తపేట, వెంకటాపూర్, నాదర్‌గుల్, తుర్కయాంజల్‌లోని కొత్తచెరువు, ఇబ్రహీం పట్నం చెరువు, ఇంజాపూర్, హయత్ నగర్ పరిసరాల్లో నాలాకు గండిపడి, కాలువ ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. అమ్మకానికి వీలులేని ఇనామ్ పట్టా భూములు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారుల పాలయ్యాయి. ఫిరంగి నాలాపై ఉన్న అక్రమాలను తొలగించి, దానిని రక్షి ంచాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఒక్కని నర్సింహులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన ఆయన, రంగారెడ్డి జిల్లాలో ఫిరంగి కాలువ పరిస్థితిని వివరించారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాలను తొలగించి, నాలా సహజ ప్రవాహాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## లంబాడీలపై కుట్ర చేస్తే సహించేది లేదు

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడ వాత్ రాంబల్ నాయక్ హెచ్చరించారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్ని స్తోందని ఆయన ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో గోండు, గుత్తి కోయ ప్రజ లను లంబాడీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లంబాడీ ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి చేసినట్లు తాము పేర్కొంటున్న వ్యాఖ్యలు కూడా దీనికి నిదర్శనమని అన్నారు. ఆగస్టు 9న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిం చిన సభలో మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో మైపతి అరుణ్‌కుమార్ ద్వారా లంబాడీలపై విమర్శలు చేయిం చారని రాంబల్ నాయక్ ఆరోపించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ద్వారా గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. లంబాడీలకు వ్యతిరేకంగా ఎవరైనా చౌకబారు వ్యాఖ్యలు చేస్తే తగిన రీతిలో స్పందిస్తామని రాంబల్ నాయక్ హెచ్చరించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, విద్యాసాగర్, క్రిస్టినా తదితరులు

## హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** రాష్ట్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ తదితర వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చడంతో పాటు వాటి నియంత్రణ, నివారణకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా హైదరా బాద్‌లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద ర్యాలీని ప్రారం భించారు. హెచ్ఎండీ ఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు సుమారు 1500 మంది పా ల్గొన్న ఈ ర్యాలీ లో హెచ్ఐ వీ, ఎయిడ్స్ నివారణ పై అవగాహన కల్పి స్తూ ప్రజలకు సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హెచ్ఐ వీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నియంత్రణకు అవసరమైన అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. కొత్తగా ఎవరూ హెచ్ఐవీ బారిన పడకుండా నివారణ చర్యలపై అవగాహన పెంచడంతో పాటు, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి అవసరమైన వైద్య సేవలు, సహకారం అందిం చాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న తల్లుల నుంచి పుట్టబోయే పిల్లలకు వైరస్ సంక్రమించకుండా అవసరమైన వైద్య సేవలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుం డా వ్యాధి నివారణ, పరీక్షలు, చికిత్స పై సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు రాష్ట్రవ్యా ప్తంగా విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములై హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్ర ణలో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సమాచార శాఖ కమిషనర్ ముకుం ద రెడ్డితో పాటు పలువురు అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యా ర్థులు, అవగాహన కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలతో ముందుకు సాగాలి

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను షాద్‌నగర్ పట్టణం లోని వీఐబీటీ జేఈఈ అకాడమీ జూనియర్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్ ముఖ్యఅతిథిగా హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భ వించిందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చి జాతీయ స్థాయిలో విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏఐఎస్ఎఫ్ ఏర్పడిందన్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ కీలకంగా పోరాడిందని పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులంతా ఏఐఎస్ఎఫ్ జెండా నీడన ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.



ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులు

**సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించండి**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యా రంగాన్ని మరింత బలో పేతం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్య దర్శి ఆకాశ్ నాయక్, హర్షిత్, సంతోష్‌తో పాటు విద్యార్థులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యసన విముక్తి ప్రతిజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం పోస్టర్‌ను షాద్‌నగర్ పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో కలిసి నశా ముక్త్ భారత్ అభియాన్ (వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర)లో భాగంగా వ్యసనాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని మున్సిపల్ చైర్మన్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మద్యం, మాదకద్రవ్యా లు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ము ఖ్యంగా యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధా నాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన రహిత సమాజ నిర్మా ణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమా జంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో బ్రహ్మకుమారీస్ బీకే శోభ, లక్ష్మీ ్మ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, సత్యనారాయణ, యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, శివ నాగయ్య, చంద్ర మోహన్, రమేష్ అగర్వాల్, రామకృష్ణ రెడ్డి, యాదవ చారి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి



అధికారుల రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** మొదటి దశలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఫరూఖ్ నగర్ పరిషత్ కార్యా లయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంజూరైన ఇళ్లలో 1,866 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 948 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 646 ఇళ్లు ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు. నిర్మాణం ప్రారంభం కాని 646 ఇళ్లపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, అతి త్వరలోనే అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...3,500 ఇళ్లు మంజూరు చేసిన ప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇది సరిపోదని, మరిన్ని ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమ న్వయం చేసుకుంటూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మరింత వేగ వంతం చేయాలని ఎంపీడీఓలను కోరారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమ స్యలు ఎదురైతే మండల అధ్యక్షుల సహాయ సహకారాలు తీసుకుని పరిష్క రించుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ ప్రారంభ సమ యంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలు మార్కౌట్ ఇచ్చి, అమలులో ఉన్న నిబంధనలను లబ్ధిదారులకు స్పష్టంగా వివరించి, ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

తెలిసి తెలియక నిబంధనలకు మించి విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించి, అనంతరం బిల్లులు మంజూరు కాక కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లబ్ధిదారులకు కల్పించవద్దని అధికారులను ఆదేశించారు. నిబం ధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం జరిగేలా ముందస్తుగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

అలాగే పైలట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను అతి త్వరలో మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమీక్షా కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సి. నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, అన్ని మండలాల ఏఈలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాయికల్ శ్రీనివాస్, రమేష్, సుదర్శన్ గౌడ్, శ్రీధర్, కుమార స్వామి గౌడ్, మున్సిపల్ కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు

## పార్కులతో పర్యావరణ సమతుల్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కమ్యూనిటీ పార్కు ద్వారా సామాజిక ఐక్యత, సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పర్యావరణ సమతుల్యాన్ని పెంపొందిస్తాయని లయన్స్ డిస్టిక్ గవర్నర్ ఆర్‌కె. రాజు అన్నారు. పోచారం డివిజన్ నారపల్లి శివాజీనగర్ కాలనీలో లయన్స్ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ బాలానగర్ వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ విరాళదాత జి. మాధవరెడ్డి దాదాపు ఒక లక్షా 70 వేల రూపాయలతో పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి చేసిన పార్కును బుధవారం జిల్లా గవర్నర్ ఆర్‌కె. రాజు పాల్గొని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పార్కు ఏర్పాటుకు అప్పటి మున్సిపల్ అధికా రులు అనుమతి ఇవ్వడంతో దాత మాధవరెడ్డి సహకారంతో పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పార్కుచుట్టూ ఫెన్సింగ్, చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. పార్కు అభివృద్ధికి సహకరించిన దాత మాధ వరెడ్డిని సహచర సభ్యులు, కాలనీవాసులు ఘనంగా శాలువా కప్పి సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు ఆదేం, లయన్స్ చైర్మన్ ధన్‌శేఖర్ రెడ్డి, రమణారెడ్డి, కాలనీవాసులు ప్రశాంత్, బాలయ్య, సురేందర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

## మన్నెమ్మ కుటుంబానికి నేతల పరామర్శ

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** పోలెమని మన్నెమ్మ ముదిరాజ్ స్వర్గ స్తులైన నేపథ్యంలో షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మంగ వెంకటేష్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు నల్లమోని బిక్షపతి ముదిరాజ్, చెట్ల జంగయ్య ముదిరాజ్, తాలూకా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు మంగ అశోక్ ముదిరాజ్, కోశాధికారి కొండే యాదయ్య ముది రాజ్‌తో పాటు సంఘం కార్యవర్గ సభ్యులు కుటుంబ సభ్యులను పరా మర్శించారు. మన్నెమ్మ ముదిరాజ్ కుటుంబానికి సంఘం తరఫున రూ.5,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ, మన్నెమ్మ ముదిరాజ్ కుటుంబానికి తాలూకా ముదిరాజ్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూల కుమార్ ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, జి. అంజయ్య ముదిరాజ్, జి. భాస్కర్ ముదిరాజ్, చల్లా నరసింహులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా రాష్ట్రవ్యాప్తం కావాలి

### - జిల్లాల ప్రతినిధుల డిమాండ్

### -కమిషనర్ రంగనాథ్‌ను కలిసి మద్దతు

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తెలంగాణలో చెరువులు, కాలువలు, పార్కులు, ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా ఉండాలంటే.. హైడ్రాను రాష్ట్రవ్యాప్తం చేయాలని పలు జిల్లాల ప్రతినిధులు కోరారు. రెండు దశాబ్దాల క్రితం హైడ్రా వస్తే నగరంలో గొలుసుకట్టు చెరువులన్నిటినీ కాపాడుకు నేవాళ్లమని అన్నారు. నగరంలో మాదిరి చెరువులు మాయం కారాదంటే.. హైడ్రా సేవలు రాష్ట్ర వ్యాప్తం కావాలని సూచించారు. హైడ్రాకు సంబంధించి ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెద క్, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన స్పీక్ (సొసైటీ ఫర్ పీపుల్స్ ఎంపవర్‌మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్) ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను కలిసినవారిలో ఉన్నారు. తప్పుడు సమాచారంతో కోర్టులను, ఇతర ప్రభుత్వ శాఖలను తప్పుదారి పట్టిస్తున్న వారిపట్ల అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. తెలంగాణలోని పట్టణాలు వరదలకు గురౌతు న్నాయని.. గతేడాది వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వరదలే ఇందుకు నిదర్శనమన్నారు.

## పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌కు రాయకల్‌లో ఓపెన్ స్పేస్ వద్దు

**షాద్‌నగర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామ పంచా యతీలో చట్టప్రకారం కేటాయించిన 10 శాతం ఓపెన్ స్పేస్‌ను పోలీస్ కన్వెన్షన్ సెంటర్ నిర్మా ణానికి సంబంధించి భూ వినియోగ మార్పిడి, లీజు లేదా కేటాయింపులకు అనుకూలంగా తీర్మానం చేయడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారికు గ్రామస్థుల తర ఫున వినతిపత్రం సమర్పించారు. రాయికల్ గ్రామపంచాయతీలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో, ప్రకృతి వైట్‌ఫీల్డ్ అవె న్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన ఎకరం 36 గుంటల భూమి లేఅవుట్‌లో చట్టప్రకారం కేటాయించిన 10 శాతం ఓపెన్ స్పేస్, బహిరంగ స్థలాన్ని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించి వినియోగించేందుకు అనుకూలంగా



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

తీర్మానం చేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఓపెన్ స్పేస్‌ను ప్రజల ప్రయోజనాలకే వినియో గించాలని పంచాయతీరాజ్ చట్టం, టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లోని 10 శాతం ఓపెన్ స్పేస్‌ను ప్రజల ఉపయోగం, పచ్చదనం, పార్కుల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని గ్రామస్థులు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాంటి స్థలాన్ని ఇతర వ్యాపార, కమర్షియల్ నిర్మాణాలకు ఇవ్వ డం లేదా లీజుకు కేటాయించడం చట్ట విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాలక మండలి సభ్యు లకు చట్టబద్ధమైన నిబంధనలను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, వారి సమక్షంలోనే ఈ తీర్మానం ఆమోదించి రికార్డుల్లో నమోదు చేయ డం విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి, చట్ట ఉల్లం ఘనకు దారితీస్తుందని గ్రామస్థులు ఆరోపిం చారు. ఈ నిర్ణయంపై పలువురు వార్డు సభ్యులు ఇప్పటికే తమ తీవ్ర అభ్యంతరాలను నోట్ ఆఫ్ డిసెంట్ రూపంలో నమోదు చేసినట్లు తెలిపారు. ఓపెన్ స్పేస్ విషయంలో తీసుకున్న నిర్ణయం గ్రామ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జెఏసి కన్వీనర్ లక్ష్మారెడ్డి

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఘట్‌కేసర్ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి బుధవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి–ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గాంధీభవన్‌లో మంత్రిని కలిసిన లక్ష్మారెడ్డి స్థానిక సమస్యలను వివరించారు. ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన పనులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతుందని, ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వంతెన నిర్మాణంలో సర్వీస్‌రోడ్‌ను ఇరువైపులా బీటీ రోడ్డు వేసి బస్‌టెర్మినల్ మీదుగా జిల్లా బస్సుల రాకపోకలు చేసేవిధంగా మున్సిపల్, ఆర్అండ్‌బి, ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఉన్న గురుకుల్ కళాశాలను జూనియర్ కాలేజ్ నుండి డిగ్రీ కాలేజ్ గా అప్‌గ్రేడ్ చేయాలని, గురుకుల్ సంస్థకు చెందిన స్థలాలు కబ్జాదారుల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మెట్రోరైల్ ను ఉప్పల్ నుండి ఘట్‌కేసర్ మీదుగా బీబీనగర్ ఎయిమ్స్ వరకు విస్తరించాలని, ఘట్‌కేసర్ చిన్న చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా సుందరికరించాలని లక్ష్మారెడ్డి వినతిపత్రంలో కోరారు.

## సొసైటీ మాజీ డైరక్టర్ నర్సింహ్మారెడ్డి మృతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం మాజీ డైరెక్టర్ ఆకిటి నర్సింహ్మారెడ్డి (66) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌కు చెందిన నర్సింహ్మారెడ్డి గత కొంతకాలంగా గొంతుకాన్సర్ బాధపడుతుండగా ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే పడిపోయి కన్నుమూసాడు. నర్సింహ్మారెడ్డి మృతి పట్ల పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన పార్థీవదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# పైపులు ఊడి పైనుంచి పడుతున్నాయ్!

## ప్రాణాలతో చెలగాటంగా ఫ్లైఓవర్లపై ప్రయాణం

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** నగరంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఫ్లైఓవర్ల నిర్వహణ గాడి తప్పిందనే ఆరోపణలు వస్తున్నాయి.. వాహనదారులకు సురక్షితమైన ప్రయాణం అందించాల్సిన ఫ్లైఓవర్లపై.. డ్రైన్ సిస్టమ్స్, స్ట్రీట్ లైట్స్, రోడ్ల నిర్వహణ, క్లీనింగ్.. అన్నీ ప్రశ్నార్థ కంగా మారాయి. ఎక్కడికక్కడ డ్రైన్ పైపులు ఊడిపడుతుంటే మరికొన్ని చోట్ల వర్షపు నీరు నేరుగా కిందకు పడుతూ వాహనదారులను ఇ బ్బందులకు గురిచేస్తోంది.. ఇక రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.. ఫ్లైఓవర్లపై ఏర్పాటు చేసిన వాటర్ డ్రైన్ పైపులు సరిగ్గా బిగించకపోవ డంతో.. కొన్నిచోట్ల పైపులు ఊడిపోయి రోడ్డుపై పడు తున్నాయి.. మరికొన్ని చోట్ల డ్రైన్ పైపుల వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో.. వర్షపు నీరు పైపుల ద్వారా కిందకు కాకుండా నేరుగా రో డ్డుపైకి, కింద వెళ్తున్న వాహనాలపైకి వస్తోంది.. ఇటీవల షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై డ్రైన్ పైప్ ఊడిపడి ఓ బైకర్‌పై పడింది.. అదృష్టవశాత్తూ బైకర్ హెల్మెట్ ధరించి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.. కానీ ఇదే ఘటన హెల్మెట్ లేని వ్యక్తికి జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదన్నది ఆందో ళన కలిగిస్తోంది.. ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి.. పాడైన పైపులు, ఫిట్టింగ్స్‌ను మా ర్చాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదనే విమ ర్శలు వస్తున్నాయి.

**డ్రైన్ వెంట్స్‌లో చెత్తాచెదారం..**

ఫ్లైఓవర్లపై వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థలు సరిగ్గా పనిచే యకపోవడంతో.. వర్షం వచ్చిన ప్రతిసారీ వాహ నదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.. కొన్ని ఫ్లైఓవర్లపై డ్రైన్ వెంట్స్‌లో చెత్త, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకి గా మారుతున్నాయి. దీంతో రోడ్డు మీద నీరు నిలిచిపోవడంతో పాటు.. నీరు ఎక్కడి నుంచి బయటకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడు తోంది.. అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై పరిస్థితి మరింత దారుణంగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి.. డ్రైన్ వెంట్స్‌కు సంబంధించిన పైపులు పూర్తిగా దెబ్బ తినడంతో.. వర్షం పడిన సమయంలో ఫ్లైఓ వర్‌పై చేరిన నీరు భారీగా కింద ఉన్న స్మశాన వాటిక వైపు ప్రవహిస్తోంది. సరైన డ్రైనేజీ అవు ట్‌లెట్ లేకపోవడంతో వరద నీరు కిందకు ఒక్క సారిగా చేరుతోంది.. దీంతో పాదచారులు, వాహ నదారులతో పాటు కింద ఉన్న ప్రాంతాల భద్ర తపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక ఇందిరా పార్క్ స్టీల్ బ్రిడ్జిపై రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవిస్తూ.. ఖాళీ మద్యం బాటిళ్లను రోడ్డుపైనే పడేస్తున్నారు.. ఇవి వాహనదారులకు ప్రమా దకరంగా మారడంతో పాటు.. నగరంలోని ప్రధా న బ్రిడ్జిల నిర్వహణ, పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**వెలగని స్ట్రీట్ లైట్లు..**

నగరంలోని అనేక ఫ్లైఓవర్లపై రాత్రి వేళల్లో లైట్లు వెలగడం లేదు. దీంతో వాహనదారులు చీకట్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షం పడుతున్న సమయంలో రోడ్డు తడిగా ఉండటం.. విజిబిలిటీ తగ్గడం.. పైగా స్ట్రీట్ లైట్లు పనిచేయకపోవడంతో ప్రమాదాల ముప్పు మరిం త పెరుగుతోంది.. ఫ్లైఓవర్లపై చిన్న గుంతలు ఏర్పడిన డ్యామేజీ కూడా రాత్రి వేళల్లో సరిగా కనిపించకపోవడంతో బైకర్స్ వాహనదారులు అదుపుతప్పే ప్రమాదం ఉంది. నారాయణగూడ, ఖైరతాబాద్, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్లపై గుంతలు ఏర్పడినా వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.. ఫ్లైఓవర్ నిర్మాణంతో పని అయిపోదని ప్రతిరోజూ వేలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గాలను నిరం తరం నిర్వహించాల్సిన బాధ్యత



కూడా అధికారు లపైనే ఉందని నగరవాసులు అంటున్నారు.

**ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?**

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఫ్లైఓవర్లు నిర్మి స్తున్నారు.. ట్రాఫిక్‌ను తగ్గించేందుకు కొత్త బ్రిడ్జి లు, స్టీల్ బ్రిడ్జిలు అందుబాటులోకి తీసుకొస్తున్నా రు. కానీ నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణపై అదే స్థాయిలో దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.. డ్రైనేజీ పైపులు సురక్షితంగా ఉన్నాయా?.. స్ట్రీట్ లైట్స్ పనిచేస్తున్నాయా?. రోడ్లపై గుంతలు ఉన్నాయా?.. డ్రైన్ వెంట్స్‌లో చెత్త పేరుకుపోయిందా?.. రెయిలింగ్స్, జాయింట్లు, ఇతర నిర్మాణ భాగాలు సురక్షితంగా ఉన్నాయా?.. అనే అంశాలపై క్రమం తప్పకుండా తనిఖీలు చేయాల్సి ఉంటుం ది.. ముఖ్యంగా వర్షాకాలంలో ఫ్లైఓవర్లను ప్రత్యే కంగా తనిఖీ చేసి.. డ్రైనేజీ వ్యవస్థను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందంటున్నారు నగర వాసులు. ఫ్లైఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడం మాత్రమే కాదు.. వాటిని సురక్షితంగా, పరిశుభ్రంగా, నిరంతరం వినియోగించుకునేలా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం.. డ్రైన్ పైపులు ఊడిపడే వరకు.. స్ట్రీట్ లైట్లు వెలగకపోయే వరకు. రోడ్లపై గుంతలు ఏర్పడే వరకు వేచి చూసి.. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

## ప్లాట్ల పంచాయితీపై పొలిటికల్ వార్

**దుద్యాల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కొడంగల్‌లో అభివృద్ధి పనులు జోరందుకున్న వేళ.. భూములు, ప్లాట్ల అంశం రాజకీయ వేడిని రాజేస్తోంది. రైతులను అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అవుటి శేఖర్ మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా రైతులను రెచ్చగొడుతూ రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. లగచర్లలోని తన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై ఆందోళన చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను రెచ్చగొట్టి తమ నాయకులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని శేఖర్ సూచించారు. కాంగ్రెస్ నాయకులు కమిషన్లకు పాల్పడ్డారని చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని సవాల్ చేశారు. తమ నాయకులు అవినీతికి పాల్పడినట్లు రుజువు చేస్తే తాను ఎలాంటి చర్యకైనా సిద్ధమని, గతంలో మీ హయాంలో జరిగిన అవినీతికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చిన్నపాటి అభివృద్ధి పనులకు కూడా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అవుటి శేఖర్

అప్పటి ఎమ్మెల్యే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వేల కోట్ల రూపాయలతో కొడంగల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అధికారులు, ప్రజల సమక్షంలో లక్కీడిప్ ద్వారా ప్లాట్ల కేటాయింపు జరిగితే కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో పోలేపల్లి సర్పంచ్ జింకల చంద్రయ్య, జయరాములు, మంగలి రాములు, కృష్ణ, లస్మయ్య, ఆంజనేయులు, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన-జైలు,జరిమానా విధించిన కోర్టు

**శంషాబాద్, ఆగస్టు12,ప్రభాతవార్త :** ఆర్‌జిఐఎ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన వారికి బుధవారం మొత్తం 8 కేసుల్లో రూ.20,000 జరిమానా కోర్టు విధించింది. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిని రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం ఇద్దరికీ ఒక్కొక్కరికి ఒక రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.2,500 చొప్పున జరిమానా విధించింది. రాగిరి శివ రాములు – ఒక రోజు సాధారణ కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా,బి. సుగ్రీవులు – ఒక రోజు కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా.మరో ఆరుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.15,000 జరిమానా విధించారు.రహదారి భద్రతను కాపాడేందుకు, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి,



కోర్టు ఆవరణలో ఇద్దరు వాహనదారులతో ట్రాఫిక్ పోలీసులు ఎస్‌హెచ్‌బి01

మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ సూచించారు.

## ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు -8 లీటర్ల నాటు సారా సీజ్

**కడ్తాల్, ఆగస్టు12,ప్రభాతవార్త :** ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రజలకు మత్తు కలిగించే పదార్థాలను అక్రమంగా విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, ధాబాలు, హోటళ్ల తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ధాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయించడం, అనుమతి లేకుండా మద్యం తాగించడం లేదా విక్రయించడం కిరాణా దుకాణాల్లో ప్రజలకు హానికరమైన మత్తు పదార్థాలను విక్రయించినా, అక్రమ సారా తయారీకి ఉపయోగించే బెల్లం, నల్లబెల్లం, పటిక తదితర పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచినా లేదా విక్రయించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కడ్తాల మండలం చరికొండ గ్రామం నుంచి అక్రమంగా సారా సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని సుమారు 8 లీటర్ల సారాను సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. సారాయి, అక్రమ మద్యం తయారీ రవాణా, విక్రయాలు లేదా గంజాయి, మాదక ద్రవ్యలు ప్రభుత్వం నిషేదించినా మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు



కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద హోటల్, పాన్ షాప్ ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజలు గమనించినట్లయితే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వివిధ కేసు లో పట్టుబడిన నిందుతులను తాహసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై అరుణ్ కుమార్, శివ ప్రసాద్ పోలీసు సిబ్బంది చెన్నయ్య, రామ్ రెడ్డి, శ్రీను, లత, సాయి, శ్రీజ పాల్గొన్నారు.

### చౌదర్‌గూడ చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

**శంషాబాద్, ఆగస్టు12,ప్రభాతవార్త :** చౌదర్‌గూడ గ్రామానికి చెందిన కనిమొని లక్ష్మయ్య (58) చెరువులోమునిగి మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పిఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. లక్ష్మయ్య భార్య కిస్తమ్మ 12 ఏళ్ల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ఆయన తన కుమార్తె కటికెల పద్మ ఇంట్లోనే ఉంటున్నాడు.ఈ నెల 10న ఉదయం సుమారు 7 గంటలకు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇంటికి తిరిగిరాకపోవడంతో మంగళవారం సాయంత్రం చౌదర్‌గూడ చెరువు కట్ట వద్ద వెతుకుతుండగా, లక్ష్మయ్య మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికితీశారు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### బోదునంపల్లిలో విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :** విజయవంతమైన ఉచిత హెల్త్ క్యాంప్ కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎదురె నాగేశ్వర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించామని సర్పంచ్ ఎదురె నాగేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో ఈ ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించామని గ్రామ ప్రజలకు హెల్త్ చెకప్ లో భాగంగా బిపి, షుగర్, గుండె, లివర్, కిడ్నీ, నరాల బలహీనత, ఎముకలు, లతోపాటు అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరిశీలించి వ్యాధులను బట్టి మందులు ఉచితం గా అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ పేదల పట్ల, గ్రామ ప్రజల పట్ల సర్పంచ్ ఎగిరే నాగేశ్వర్ కు ఉన్న అభిమానానికి ఆయన మంచితనానికి గ్రామానికి నాగేశ్వర్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని అంటూ సర్పంచ్ నాగేశ్వర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాపిరెడ్డిగూడ పాఠశాలలో ఉత్సాహంగా మార్క్ పోల్ ఎన్నికలు




మార్క్ పోల్‌లో పాల్గొన్న విద్యార్థులు

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మార్క్ పోల్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో విద్యార్థులందరూ ఆసక్తిగా పాల్గొని , ఉపాధ్యాయులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్‌పీఎల్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీ పడగా , హేమంత్ కుమార్ గౌడ్ విజేతగా నిలిచారు. హెడ్ గర్ల్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీ చేయక, అమూల్య విజయం సాధించింది. హెడ్ బాయ్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీ చేయగా, మూడవత్ గౌతం విజేతగా నిలిచాడు. ఎన్నికల ప్రక్రియను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఇటువంటి ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పోక్సో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ప్రత్యేక పోక్సో న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది.కేశంపేట పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన క్రైమ్ నంబర్ 161/2019 కేసులో ఐపీసీ 366తి, 376 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 3, 4 సెక్షన్లు, ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 9 కింద కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన ఎస్సీ నంబర్ 263/2020పై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ప్రత్యేక సెషన్స్ జడ్జి, శ్రీజు। అదనపు జిల్లా జడ్జి మరియు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. స్వాతిరెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. కేసులో నిందితుడైన కొండాని నరేష్ (28), ఇప్లపల్లి గ్రామం, కేశంపేట మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు. నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా కేశంపేట ఎస్ఐ కె. వెంకటేశ్వర్లు, రెండో దర్యాప్తు అధికారిగా షాద్‌నగర్ రూరల్ సీఐ ఎం.జి.ఎస్. రామకృష్ణ వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీలు రామకృష్ణ, శేఖరాచారి, సబియా సుల్తానా వాదనలు వినిపించారు.కేసు విచారణలో ప్రాసిక్యూషన్‌కు సహకరించిన సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు. కేసు బ్రీఫింగ్ అధికారిగా కేశంపేట ఎస్‌హెచ్‌ఓ బి. నరహరి, లైజనింగ్ అధికారులుగా డబ్ల్యూపీసీ ఎన్. జ్యోతి, ఏఎస్ఐ పి. సక్రియా వ్యవహరించారు.

### యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ

**మోమిన్‌పేట్,ఆగస్టు 12,ప్రభాతవార్త:** రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా, సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్" అనే నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో భాగంగా 2026 ఆగస్టు 6వ తేదీ నుండి మోమిన్‌పేట్ మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా (ఎఫ్‌ఎఫ్) యాప్ ద్వారానే నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణా రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతు ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని, ఎఫ్‌ఎఫ్ఎస్ యాప్‌లో రైతులు ఎలా నమోదు చేసుకోవాలి,రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గోగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్‌ఎఫ్ డౌన్ చేసుకుని నమోదు చేసుకోవాలి.ఫార్మర్ ఐడి ఉన్న రైతులు ఫార్మర్ ఐడి లేదా ఆధార్ సంఖ్య ద్వారా లాగిన్ అయ్యి, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపి ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతు భూమి వివరాలు స్వయంగా యాప్‌లో అందుబాటులోకి వస్తాయని తద్వారా రైతులకు అవసరమైన ఎరువులను సులభంగా పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు.



ఏఓ రామకృష్ణా రెడ్డి

## సంగెం వద్ద ఎదురెదురుగా బైకులు ఢీ

-ఎస్‌ఓటీ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామం సమీపంలో జేపీ దర్గా దారి లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బీజార శ్యాంసుందర్ గౌడ్, సత్యానారాయణ ఇద్దరు కలిసి విధుల నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు .స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. సంగెం గ్రామ సమీపంలో విస్లావత్ సక్రు ద్విచక్ర వాహనం స్ప్లెండర్ ప్లస్ పై అతివేగంగా జాగ్రత్తగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో శ్యాంసుందర్ గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి . ఈ ప్రమాదంలో విధులకు వెళ్తున్న ఎస్‌ఓటీ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని లిమ్స్ ఆసుపత్రికి తరలించారు.




యాద్గార్‌పల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బిజేపి అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్

## యాద్గార్‌పల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**కీసర, ఆగస్టు12,ప్రభాతవార్త:** కీసర సర్కిల్ పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం విద్యార్థులు,ఆధ్యాపక బృందం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బిజేపి సర్కిల్ 1 అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ గ్రామ యువకులు అందరూ కలిసి గ్రామంలోని వీధి వీధిన తిరుగుతూ,స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ దేశభక్తి గీతాలతో గ్రామంలో ఒక పండుగ వాతావరణం నెలకొందన్నారు.దేశం పట్ల జాతీయ జెండా పట్ల చిన్న వయస్సు నుండే దేశ భక్తిని పెంపొందించుకోవాలని,రేపటి తరాలకు మీరే భవిష్యత్తు అవుతారని పేర్కొన్నారు.హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,సర్కిల్ బిజేపి ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి,రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సిఐ నరహరి,తదితరులు

## ప్రమాదాల నివారణకు రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :** ప్రమాదాల నివారణకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను ముందస్తుగా తొలగిస్తున్నామని కేశంపేట సిఐ నరహరి తెలిపారు. కేశంపేట మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగిన నేపథ్యంలో, కేశంపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి సిబ్బందితో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రమాద స్థలంలో రహదారి పక్కన ఉన్న పొదలు మరియు చెట్ల కొమ్మల కారణంగా రహదారి విజిబిలిటీ సరిగా కనిపించకపోవడం గమనించారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ మరియు స్థానికులతో మాట్లాడి, రహదారి పక్కన ఉన్న పొదలు, చెట్ల కొమ్మలను తొలగించి రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించే విధంగా క్లియర్ చేయించారు.రహదారి పక్కన పెరిగిన చెట్లు, పొదల వల్ల వాహనదారులకు విజిబిలిటీ తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఇలాంటి ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు అలాగే వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, అప్రమత్తంగా వాహనాలు నడపాలని వాహనదారులకు సిఐ నరహరి తెలిపారు.

## పంచాయతీసిబ్బందికి సర్పంచి చేయూత



పంచాయతీ సిబ్బందితో సర్పంచు అనిత శరణం

**యాచారం,ఆగస్టు 12, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సిబ్బంది సేవలు వెలకట్టలేని సర్పంచ్ మస్కు అనిత శరణం కొనియాడారు. యాచారం గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ మస్కు అనిత శరణం ఆధ్వర్యంలో సబ్బులు, నూనెను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి పరిశుభ్రతను కాపాడటంలో పంచాయతీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు. సిబ్బంది అందరూ నిరంతరం శ్రమిస్తూ గ్రామాన్ని ముందంజలో ఉంచుతున్నారని పేర్కొన్నారు.పంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, వారి వేతనాలను పెంచే విషయమై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంగ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి పి. శివకుమార్, వివిధ వార్డుల సభ్యులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## భూసేకరణ సమస్యలపై ఎమ్మెల్యేని కలిసిన మొండిగౌరెల్లి రైతులు

**యాచారం,ఆగస్టు 12 ప్రభాతవార్త :** యాచారం మండలం పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో భూముల సేకరణ విషయమై స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని రైతులు కలిశారు. గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైతులందరూ కలిసి ఎమ్మెల్యేకు తమ ఆవేదనను, సమస్యలను విన్నవించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు రైతులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెబుతూ, మళ్ళీ ఒకసారి జిల్లా కలెక్టర్ గారితో ప్రత్యేకంగా సమయం (అపాయింట్‌మెంట్) ఇప్పించి, రైతులకు కలెక్టర్‌తో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. మీకున్న ప్రతి సమస్యను కలెక్టర్ గారికి నిస్సంకోచంగా వివరించి పరిష్కారం కోరవచ్చని ఆయన రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మొండిగౌరెల్లి ఉపసర్పంచ్ బడే కుమార్, వివిధ వార్డుల సభ్యులు, గ్రామానికి చెందిన రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో మొండి గౌరెల్లి సర్పంచ్



### విద్యార్థులకు యూనిఫామ్స్, టై, బెల్ట్ పంపిణీ

**కోట్‌పల్లి, ఆగస్టు 12,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుధవారం నాడు మండల విద్యాధికారి చంద్రప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు .యూనిఫామ్స్, టై, బెల్ట్ మరియు షూల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థులు క్రమశిక్షణతో, పాటు మంచిగా చదువుకొని పాఠశాలకు 100 ఫలితాలు సాధించేలా కృషి చేయాలని విద్యార్థులు విద్యలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో చైర్మన్ బసమ్మ, బుచ్చిరెడ్డి, మోహన్, యాదవ రెడ్డి, యాస్మిన్, యాస్మిన్ బేగం, ఫాతిమా బేగం, శ్రీనివాస్, అంజయ్య, లక్ష్మణ్, నరసింహారెడ్డి, తిరుమలయ్య, శివప్రసాద్, వెంకటేష్, నవీన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### చేప పిల్లలను పంపిణీ చేయండి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 12,(ప్రభాతవార్త):** తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ చేయాలని ముదిరాజ్ యువసేన తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ సత్యం ముదిరాజ్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో మెత్తం 1100 చెరువు కుంటలు ఉన్నాయని అందులో 213 సంఘాలలో 10 వేలకు పైగా గుర్తింపుపొందిన సభ్యులు ఉన్నారని అన్నారు.ప్రస్తుత సంవత్సరం వర్షాకాలం పూర్తి కావస్తున్న ఇప్పటిదాకా చేప పిల్ల పంపిణీ చేయడం లేదని పెర్కొన్నారు. ఉచిత చేప పిల్లల కొనుగోలు గ్రామ సొసైటీలోకి డబ్బులు నేరుగా ఖాతాలో జమ చేయాలని అన్నారు. చేప పిల్లలను పంపిణీ చేయకుంటే ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో మత్స్యశాఖ కార్యాలయం ముట్టడిస్థామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

**కేశంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలో



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మికశోభ, 40సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. గురుబోధ రంగదాసు ఆధ్వర్యంలో కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులందరూ ఏకమై హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం వచ్చిన భక్తులకు కేశంపేట మండల కేంద్రంలోని మణికంఠ మెడికల్ హాల్ నిర్వాహకులు పిప్పళ్ళ పాండు యాదవ్ కుటుంబ సభ్యులు వచ్చిన భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

### కీసర పోస్ట్‌ఆఫీస్‌లో ఖాతాదారులకు ఉచితంగా పతాకాల పంపిణీ

**కీసర,ఆగస్టు12,ప్రభాతవార్త:** కీసర పోస్ట్‌ఆఫీస్‌లో ఖాతాదారులుగా ఉన్న వారికి మాత్రమే వారి వారి ఇళ్లపై వ్యక్తిగతంగా జాతీయ జెండాను



పోస్ట్ ఆఫీసులో ఖాతా ఉన్న వారికి ఉచితంగా జాతీయ జెండాను అందజేస్తున్న నల్ల వెంకట్‌రెడ్డి

ఎగురవేసేందుకు త్రివర్ణ పతాకాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు సబ్ పోస్ట్ మాస్టర్ భాస్కర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి దాత బిజేపి ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి త్రివర్ణ పతాకాలను అందజేశారు.ఈ సందర్భంగా నల్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు,ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే స్ఫూర్తిని ప్రజల్లో కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.అదే విధంగా పోస్ట్‌ఆఫీసు ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ప్రభుత్వ పథకాలు,ఇతర పోస్టల్ సేవలపై అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయడం తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.పోస్ట్ ఆఫీసు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేయాలని కోరారు.



పూడూరు మండలం చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి కె సుధాకర్‌లాల్ తదితరులు

### ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి కె.సుధాకర్‌లాల్

**పూడూరు, ఆగష్టు 12, ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి కె సుధాకర్‌లాల్ హెచ్చరించారు.బుధవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని వివరించారు.ఆసుపత్రుల్లో అన్నిరకాల మందులు ఉన్నాయని,ప్రజలు ఎవ్వరుకూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకూడదని తెలిపారు.తొలుత ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలను,అటెండెంట్స్ రిజిస్టర్‌ను,మందుల స్టోర్‌రూం,లేబరేటరిగదిని పరిశీలించారు.అనంతరం వైద్యసేవలు పొందడానికి ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి సేవలగురించి ఆరాతీశారు.ఈ కార్యక్రమంలో డా.మహ్మద్ ఫారూఖ్,పిహెచ్‌ఎన్ రామేశ్వరి,సిబ్బంది రవి,మహ్మద్ ఆలీ,కవిత,మంజుల, సుహాసిని, భాగ్యలక్ష్మీ తదితరులు ఉన్నారు.



రైతులకు సమీకృత వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారి మాధవిలత

## ఎటిఎంఎ ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయంపై శిక్షణ

**కీసర,ఆగస్టు12,ప్రభాతవార్త:** కీసర రైతు వేదికలో ఏటిఎంఏ ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ విధానం,మల్బరీ సాగు ప్రాధాన్యత, పంటల నమోదు విదానంపై బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.రీసోర్స్ పర్సన్ మధుబాబు రైతులకు సమీకృత వ్యవసాయం విదానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుతో పాటు పాడి పశువులు,గొర్రెలు,మేకలు,కోళ్ల పెంపకం,చేపల పెంపకం,ఉద్యాన పంటలు వంటి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను సమస్వయం చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు.మల్బరీ సాగు,పట్టు పురుగుల ద్వారా రైతులకు అదనపు, స్ధిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.నాణ్యమైన మల్బరీ ఆకుల ఉత్పత్తి,శాస్త్రీయ పద్దతుల్లో పట్టు పురుగుల పెంపకం,కోకూన్ల నాణ్యత పెంపకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు.వ్యవసాయ అధికారి మాధవిలత మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ప్రాదాన్యంగా ఎంపిక చేసిన 7 రకాల వారికి మాత్రమే వర్తిస్తుందని రైతులకు వివరించారు.రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను సకాలంలో నమోదు చేసుకుని ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని తెలిపారు.రైతులు సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభించి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ మనోజ,బిటిఎం సంతోష్,రైతు సంఘం నాయకులు పినింటి క్రిష్ణారెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులుగా రామేశ్వర్

**వికారాబాద్,ప్రభాతవార్త :** ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ సిలారి రామేశ్వర్ ఎన్నికయ్యారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు బుధవారం ఎస్.గోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు రామేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఉప సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్ గోపాల్ కు కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర అధ్యక్షుల చేతిమీదుగా నియామక పత్రం తీసుకుంటున్న రామేశ్వర్

## ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన

**కొడంగల్,అగష్టు 12,ప్రభాతవార్త:**ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమని అలాంటి ఓటు హక్కు,ఎన్నికల విధానంపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.బుధవారం దుద్యాల మండలంలోని కుదురుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెడ్ బాయ్, హెడ్‌గర్ల్,డిప్యూటీ హెడ్ బాయ్,డిప్యూటీ హెడ్‌గర్ల్‌కు సంభందించి ఎన్నిక ప్రక్రియను బ్యాలెట్ పేపర్ విధానంలో పూర్తిస్థాయిలో పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూర్ణచందర్‌రావు, వేణుగోపాల్,గ్రామ సెక్రటరీ రాధా ప్రస్తుత ఉపసర్పంచ్,మాజీ సర్పంచ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో హెడ్‌బాయ్‌గా శ్రీహరి,హెడ్‌గర్ల్‌గా చంద్రకంటి నవ్యశ్రీ,10వ తరగతి డిప్యూటీ హెడ్‌బాయ్‌గా శివకళ్యాణ్,డిప్యూటీ హెడ్‌గర్ల్‌గా బోయిని భార్గవి గెలుపొందారు.

### చేవెళ్ళ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్దిదారులు

## పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

**-చేవెళ్ళ మున్సిపల్ కమీషనర్ యాదగిరి పిలుపు**




**చేవెళ్ల, అగస్టు 12, ప్రభాతవార్త :**చేవెళ్ళ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరూ " చేయూత " పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలని చేవెళ్ళ మున్సిపల్ కమీషనర్ యాదగిరి తెలిపారు.చేవెళ్ళ మున్సిపాలిటీ పరిధిలో చేయూత సోషల్ సెక్యూరిటీ పెన్షన్ పథకం ఫేజ్1 కింద అర్హులైన వారు నూతన పెన్షన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ బాధితుల తోపాటు పలు వర్గాలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన పత్రాలు నిబంధనల కచ్చితంగా ఉండాలన్నారు.నింపిన దరఖాస్తు ఫారంతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటో,ఆధార్ కార్డు జిరాక్స్,బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్,రేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు) లేదా రెవెన్యూ శాఖ జారీ చేసిన వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రం,వయస్సు రుజువు పత్రం జనన ధృవీకరణ పత్రం,పాఠశాల సర్టిఫికేట్ ఓటర్ కార్డు లను సమర్పించాలన్నారు.వితంతువులు భర్త మరణ ధృవీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్)ఒంటరి మహిళలు తమ విడాకుల పత్రం, కోర్టు ఆర్డర్, విడిపోయినట్లు తెలిపే పత్రంతహసిల్దార్ స్థాయి విచారణ నివేదిక, వివాహితలకు 18 ఏళ్లు, అవివాహితలకు 30 ఏళ్లు నిండి ఉండాలి ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం విడిపోయి ఉండాలన్నారు.గీత కార్మికులు కల్లు గీత సహకార సంఘం సభ్యత్వ ధృవీకరణ, ఎక్సైజ్ శాఖ ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.చేనేత కార్మికులు హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్ శాఖ ధృవీకరణ పత్రం సమర్పించాలన్నారు.డయాలసిస్ బాదితులు నిరంతరం డయాలసిస్ చికిత్స పొందుతున్నట్లు వైద్య ధృవీకరణ పత్రం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా నమోదు పత్రాలు సమర్పించాలన్నారు .ఇప్పటికే పెన్షన్ పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, రెండోసారి సమర్పించే దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని కమిషనర్ స్పష్టం చేశారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డుల జిరాక్స్ జతచేసి చేవెళ్ళ మున్సిపల్ కార్యాలయంలో వెంటనే అందజేయాలని కోరారు.

## మోడల్ స్కూల్ నిధుల ఖర్చులపై విచారణ జరపాలి

**చేవెళ్ల, అగస్టు 12, ప్రభాతవార్త :** చేవెళ్ల మండలం కేంద్రంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ నిధుల వినియోగంపై పలు సందేహాలున్నాయని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ కోరారు.

బుధవారం పాఠశాల విద్య కమిషనర్ నవీన్ కోలాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. యోగా, క్రీడా సామగ్రి, విహారయాత్రల ఖర్చులపై విచారణ జరిపి అవకతవకలు తేలితే బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి అల్లీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల విద్య కమిషనర్ నవీన్ కోలాస్‌ను కలిసి ఫిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్

# గుండ్లకుంటలో అభివృద్ధి పనుల పరిశీలన

**కొడంగల్,అగష్టు 12,ప్రభాతవార్త:** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గుండ్లకుంట గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ పరిశీలించారు.గ్రామంలో చురుకుగా కొనసాగుతున్న నూతన పాఠశాల భవనం,డ్రైనేజీ పనులు,వాటర్ ట్యాప్ కనెక్షన్‌లు,విద్యుత్ పనులతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌తో కలిసి పరిశీలించారు.పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైర్మేన్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు, గ్రామస్దులు పాల్గొన్నారు.



గుండ్లకుంటలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

# మార్పు కోసమే సిపిఐ పాదయాత్ర




కొడంగల్‌లో సిపిఐ నాయకుల పాదయాత్ర

**కొడంగల్,అగష్టు 12,ప్రభాతవార్త:** ప్రజావ్యతిరేకపాలనతో భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ స్పూర్తిని దెబ్బతీస్తుందని దేశంలో మార్పులు తీసుకురావడానికి సిపిఐ పాదయాత్ర నిర్వహిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్,సిపిఐ కొడంగల్ నియోజకవర్గ కార్యదర్శి గంటి సురేష్‌కుమార్,జిల్లా సహయ కార్యదర్శి పీర్ మొహమ్మద్,జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్‌లు అన్నారు.బుధవారం కొడంగల్‌లోని సిపిఐ పార్టీ అద్వర్యంలో లాహోటీ కాలనీ నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా వినాయక చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్దలను రిర్వీర్యం చేసి,ఆర్దిక దోపిడికి ప్రైవేట్ సంస్దలు పాల్పడే విధంగా కేంద్రం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కేంద్రం మద్దతు ధరలు కల్పించడంలో విఫలమైందన్నారు.నిత్యవసర సరుకుల ధరలు సామాన్యులకు అందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిస్కారం కోసం ప్రజలంతా కలిసి రావాలని దేశంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యల కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని,బీజేపీ ప్రజావ్యతిరేక విధనాలే దాని పతనానికి దారి తీస్తాయని,దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తుందన్నారు.విబిజీ రాంజీ చట్టాన్ని వెంటనే నిలిపివేసి ప్రస్తుతం అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను యధాతథంగా కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళా సంఘం నాయకురాలు సావిత్రి,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రయ్య,ఇలియాజ్,రాజునాయక్,హుస్సేన్,అంజనేయులు,సాయపన,శంకర్‌నాయక్,హనుమంతు,తులసిరామ్‌నాయక్,నర్సిములు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న బి ఆర్ఎస్ నాయకులు

**తలకొండపల్లి ,ఆగస్టు 12, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల బి ఆర్ఎస్ నాయకులు బుధవారం నాడు శ్రీశైలం లోని పుణ్యక్షేత్రం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఎంతో పవిత్రమైన శ్రీశైలంలో గల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

అనంతరం స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్, శంకర్ నాయక్ స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు. దేవాలయాన్ని సందర్శించి

యుటిఎఫ్ మండల అధ్యక్షులు విష్ణుమూర్తి మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ఉపాధ్యక్షులు రమేష్ నాయకులు సీనయ్య హరిలాల్ మనోజ్ కుమార్ రవీందర్ రవికుమార్

# యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

**ఆమనగల్లు, ఆగస్టు12, ప్రభాతవార్త:** దేశ సేవ, సంస్కారమే లక్ష్యంగా యువత ముందుకు నడవాలని, యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని ఆర్ఎస్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. దేశసేవలో ఎంతోమంది అమరులయ్యారని, వారి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ అడుగులు వేయాలన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆమనగల్లు ఖండ ఆధ్వర్యంలో వందేమాతరం 150 వసంతాల వేడుకల నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ యువసమ్మేళనం నిర్వహించారు. యువకులు, విద్యార్థులు, ఆర్ఎస్ఎస్, బిజెపి, హిందూసంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. పట్టణంలోని వాసవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ముఖ్య అతిథిగా హాజరైన విభాగ్ సంగచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగించి యువతకు దేశభక్తిని పెంపొందించే అంశాలను వివరించారు. ఈసంధర్భంగా వందేమాతరం నినాదాలతో పరిసర ప్రాంతాలు హోరెత్తిపోయాయి. వందేమాతరం మంత్రం స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రాణం పోసింది. నేటి యువత చదువుతో పాటు దేశభక్తిని, క్రమశిక్షణను, సంస్కారాన్ని అలవర్చుకోవాలి. డ్రగ్స్, మొబైల్ వ్యసనాలను వదిలి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు తెలిపారు. విద్యార్థులు దేశ సేవలో నిలిచేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రతి యువకుడు వారంలో ఒక గంట సమాజ సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలూరు రాజేశ్, ఖండ సంగచాలక్ అంజయ్య, ఖండ కార్యవాహ చుక్క ఆనంద్, తిరుపతి, శ్రీశైలం, చెక్కాల లక్ష్మణ్, దాస్యం వంశీ, గణేశ్, ప్రభాకర్, విశ్వనాథం, శివ, సందీప్, మల్లేశ్, భరత్, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




.యువతనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



## గ్రామానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి

**తలకొండపల్లి ,ఆగస్టు 12, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి అధిక నిధులు ఇచ్చి అభివృద్ధికి ఆదుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి గ్రామ సర్పంచ్ డోకూరు సునీత ప్రభాకర్ రెడ్డి వినతి పత్రంలో కోరారు. మంగళవారం నాడు హైదరాబాదులోని ఎమ్మెల్యే ఇంటిలో కలిసి గ్రామానికి పలు అభివృద్ధి పనుల కోసం అధికంగా నిధులు ఇచ్చే ఆదుకోవాలని వినతి పత్రం ఇచ్చారు. పడకల్ గ్రామం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పుట్టిన గ్రామమని, ఈ గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేయవలసి ఉన్నందున ఎమ్మెల్యే గారి దృష్టి పెట్టి తమ గ్రామానికి ఆదుకోవాలన్నారు. బూర్గుల రామకృష్ణారావు పడకల్ గ్రామంలో పుట్టినందున అతని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అతని పేరు నా ఆడిటోరియం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. దాంతోపాటు అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు వీధిలైట్లు గ్రామపంచాయతీ బిల్డింగ్ తదితర పనులకు నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి పడకల్ గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తాగుడుకి బానిసై భార్యను హత్య చేసిన భర్త

**ఘట్‌కేసర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కుటుంబ తగాదాలతో భార్యను సిమెంట్ ఇటుకతో బాది హత్య చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్‌లో చోటుసుకుంది. తాగుడుకు బానిసై, అనుమానంతో కట్టుకున్న భార్యపై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేసిన సంఘటనలో బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా కిలగనపూర్ మండలం సలకలపూర్ గ్రామానికి చెందిన ఇస్లావత్ మాన్య (మృతురాలి సోదరుడు) ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం..అతని చెల్లెలు మాధవి (37)ని 18 సంవత్సరాల క్రితం కాట్రావత్ రాజు (44)కి ఇచ్చి వివాహం జరిపించారు. వీరు గత 15 సంవత్సరాలుగా ఘట్‌కేసర్ డివిజన్ ద్వారకానగర్‌లో నివాసముంటున్నారని వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా రాజు మద్యానికి బానిసై, భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని తరచుగా శారీరకంగా, మానసికంగా వేధించేవాడని తెలిపారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించి నచ్చచెప్పినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా బుధవారం అర్ధరాత్రి సమయంలో రాజు మద్యం మత్తులో ఇంటికి వచ్చి, కుటుంబ సభ్యులందరూ నిద్రపోయిన తర్వాత పథకం ప్రకారం భార్య మాధవిని చంపాలనే ఉద్దేశంతో ఆమె ఛాతీపై పెద్ద సిమెంట్ ఇటుకతో ఎత్తివేసి కొట్టాడు. చాతిపై గాయంతో మాధవి స్పృహకోల్పోగా, కుటుంబ సభ్యులు, పొరుగువారు వెంటనే 108 అంబులెన్స్‌లో ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన డ్యూటీ డాక్టర్ అర్ధరాత్రి 1:30 గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందినట్లు ధృవీకరించారు. కాట్రావత్ రాజుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు.

## రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

**శామీర్‌పేట్, ఆగష్టు 12, ప్రభాతవార్త:** కేటిఆర్, హరీష్‌రావులు మంత్రులుగా పనిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుని సంపాదించిన డబ్బులను బయటి దేశాల్లో కంపెనీలు నడుపుతున్నారని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం



తూంకుంటలో శామీర్ పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి తమ్ముడిపై కేటిఆర్, హరీష్‌రావులు లేనిపోని అభియోగాలు మోపుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని దివాళ తీయించిన ఘనత కేసిఆర్‌కే దక్కు తుందన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన మల్లారెడ్డి అభివృద్ధిని పట్టించుకోకుండా తన కళాశాలలను విస్తరించుకుంటు న్నాడని విమర్శించారు. ఓడిపోయినప్పటికి తాము ప్రజల్లో ఉంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన నిధులను ప్రజలకు చేరవేస్తున్నామని చెప్పారు.

ఈసమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం, మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్‌రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ డ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**ఘట్‌కేసర్, ఆగష్టు 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్ నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా శివారెడ్డిగూడ శ్రీప్రసన్నవీరాంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. బిజెపి నాయకులు, కళాశాల విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకొని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి ఘట్‌కేసర్ ఇంచార్జ్ జైపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి విప్పర్ల హనుమాన్, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ బోడ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు చెల్లక శ్రీధర్, మంగు రాధిక, కార్యదర్శి సిద్దిరాజు, సీనియర్ నాయకులు కాలేరు రామోజీ, పల్లె మధుసూధన్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షులు సుర్వి అనిల్‌గౌడ్, కోకన్వీనర్ సురేందర్‌యాదవ్, బూత్ అధ్యక్షులు మాధవి, మమత శర్మ, శరత్, కిరణ్ కుమార్, చంద్రకాంత్, చలపతి రావు, దీపక్ వ్యాస్, సీనియర్ నాయకులు హరగోపాల్ గారు, యువమోర్చ నాయకులు భరత్‌యాదవ్, అశోక్, రుషి, అభియాదవ్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

## నేడే చేవెళ్లలో యువ సమ్మేళనం

**చేవెళ్ల, అగస్టు 12, ప్రభాతవార్త :** వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది కార్యక్రమాల్లో భాగంగా చేవెళ్లలో ఈ నెల 13వ తేదిన గురువారం యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఖండ సంఘచాలక్ బిల్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు. యువతలో జాతీయ, స్వదేశీ భావనతో పాటు సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్షమన్నారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనానికి సామాజిక సమరసత వేదిక సంయోజక్ అప్పల ప్రసాద్ ముఖ్యవక్తగా హాజరవుతారని పేర్కొన్నారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు .

## నూతన ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహకు సన్మానం



రంగారెడ్డి రూరల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహను సన్మానించిన బిజెపి నాయకులు

**చేవెళ్ల, అగస్టు 12, ప్రభాతవార్త :** నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి రూరల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహను చేవెళ్ల మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైభవ్‌రెడ్డి ఎస్సీ మోర్చా కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో నరసింహను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన నరసింహకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పత్తి సత్యనారాయణ, చేగురి ప్రవీణ్ రెడ్డి, నాగరాజు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,, జయసింహారెడ్డి, గణేష్ కార్యకర్తలు పాల్గొన్నారు

## పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అప్పగింత



**తలకొండపల్లి, ఆగస్టు12, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలో గత కొన్ని రోజుల క్రితం సెల్ ఫోన్లు పోగొట్టుకున్న లబ్ధిదారులకు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను కనుగొని పోగొట్టుకున్న బాధితులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సిఐ జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్వర్యంలో సెల్ ఫోన్లు దొంగిలించబడిన వారి వివరాలను కనుగొని సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటి రిజిస్టర్ దార బాధితుల ఫిర్యాదుల మేరకు టెక్నికల్ ఆధారాలకు కనుక్కోవడం జరిగిందన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న పదిమంది బాధితులను ఈపించి వారి ఫోన్ లోను వారికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం డిజిటలైజేషన్లు ప్రతి ఒక్కరు తమ ఫోన్లను వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, అనామకుల ఫోన్ కాల్ కు తమ వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని ఆయన తెలిపారు. అనంతరం బాధితులకు సెల్ఫోన్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై శేఖర్, తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 35 లక్షల ప్రమాద బీమా చెక్కు పంపిణీ చేసిన ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి, ఆగస్టు12, ప్రభాతవార్త:**




రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన తిరుమణి శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి మంగళవారం నాడు తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన 35 లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ అంతారం గ్రామానికి చెందిన తిరుమణి శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశకు గత రెండు నెలల క్రితం మృతి చెందాడు ప్రమాదవశాత్తు గత రెండు నెలల క్రితం మృతి చెందాడు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్‌లో జీవిత బీమా పాలసీ చేసినందున ఆ సంస్థ తరఫున భారీ మొత్తంలో 35 లక్షల రూపాయలు మంజూరు కావడం బాధి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రస్తుతం జీవిత బీమా పాలసీని ఏర్పాటు చేసుకోవాలని జీవితానికి భీమ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందని భవిష్యత్ కుటుంబానికి ఆదుకునేందుకు బీమా సౌకర్యం ఎంత ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ యాజమాన్యం తదితరులున్నారు లబ్ధిదారులు శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ యాజమాన్యం తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**తలకొండపల్లి, ఆగస్టు12, ప్రభాతవార్త:** గ్రామంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి సమీపంలో తప్పకుండా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాంపూర్ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ అన్నారు. మంగళవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల సంగాయపల్లి గ్రామంలో గ్రామస్తులకు మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నిర్దేశించి ఆమె మాట్లాడుతూ పర్యావరణం కాపాడేందుకు మొక్కలు ఎంతో ఉపకరిస్తాయని, గ్రామస్తులందరు తమ ఇంటి సమీపంలో మొక్కలు పెంచుకొని వర్షాలు కురిసేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జీవరాశి మనుగడకు చెట్లు ఎంత ఉపయోగపడతాయని, భావితరాల బాబు కోసం అందరూ తమ ఇంటి సమీపంలో ఖాళీ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు తమ ఇంటి సమీపంలో ఖాళీ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటి పరిరక్షి ంచుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు నరేష్ రమేష్ వేదం ఉదయ శంకర్ చెరువు సంఘం సెక్రటరీ చిల్కం శేఖర్ గ్రామస్తులు పబ్బ సంపత్ విష్ణువర్ధన్ రెడ్డి శేఖర్ రమేష్ రాజు జంగయ్య నరసింహ గౌడ్ వినోద్ బతుకమ్మ పార్వతమ్మ జంగయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి

**తలకొండపల్లి, ఆగస్టు12, ప్రభాతవార్త:**

గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నాడు తలకొండపల్లి తాసిల్దార్ రమేష్ కుమార్కు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రాములయ్య మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి అనేక రకాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన వ్యక్తం పరుస్తున్నామని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాసిల్దార్ సహకరించాలని, దశల వారి పోరాటంలో భాగంగా మెమోరాండం ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, 21 నుంచి 26 వరకు రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులతో నిరసన తెలియజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని, ఆరో విడత డి ఎ ప్రకటించాలని, మొత్తం 29 అంశాలతో కూడిన ఉపాధ్యాయ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రాములయ్య, ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు శ్రీనయ్య, హరిలాల్, మనోజ్ కుమార్ , రవీందర్ ,రవికుమార్, యాదయ్య తదితరు ఉపాధ్యాయులు ఉన్నారు.